క్లుప్తంగా

సీతమ్మను సత్కరించిన వ్యాపారులు



ఆత్మకూర్: తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్ పర్సన్‌గా నియమితులైన కొత్తకోట సీతాదయాకర్‌రెడ్డిని వర్తక సంఘం వ్యాపారులు, కాంగ్రెస్ నాయకులు అభినందించారు. సోమవారం ఆత్మకూర్‌లోని మాజీ ఎంపీపీ గీతారెడ్డి నివాసంలో సీతమ్మను ఆత్మకూర్ వర్తక సంఘం అధ్యక్షుడు ఏపూరి యాదగిరి శెట్టి, ప్రధాన కార్యదర్శి షాకీర్, కోశాధికారి కిషోర్ తదితరులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు.

పీఎల్ఎస్‌వీ ఆర్గనైజేషన్ పోస్టర్ విడుదల



వనపర్తి రూరల్: వనపర్తి జిల్లా కేంద్రంలోని ఎస్‌డీఎం న్యాయ కళాశాలలో యువ న్యాయ విద్యార్థుల హక్కుల సాధనకు సోమవారం నూతన కన్వీనింగ్ కమిటీని ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా శరత్‌గౌడ్, కమిటీ సభ్యులుగా గోపాలకృష్ణ, భరత్, పృథ్వీ, మల్లేష్, జాఫర్, సుభాన్, అర్జున్, సురేష్, జ్యోతిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతనంగా ఏర్పడిన పీఎల్ఎస్‌వీ ఆర్గనైజేషన్ పోస్టర్‌ను కన్వీనర్ శరత్‌గౌడ్ సభ్యులతో కలిసి విడుదల చేశారు. న్యాయ విద్యార్థులు కేవలం పాఠశాల గడియలకే పరిమితం కాకూడదని, వారికి ఉన్న నైపుణ్యాన్ని సమాజం మేలు కోసం వినియోగించుకోవాలన్నారు. ఈ ఆర్గనైజేషన్ ద్వారా విద్యార్థుల సమస్యలు, మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలపై చట్టపరంగా అవగాహన కల్పించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

ఇసుక టిప్పర్, జేసీబీ పట్టివేత

వనపర్తి రూరల్: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న టిప్పర్, జేసీబీని సోమవారం పట్టుకుని వాటి యజమానులపై కేసు నమోదు చేసినట్లు పెబ్బేరు ఎస్‌ఐ యుగేందర్‌రెడ్డి తెలిపారు. పెబ్బేరు మండలం, రంగాపురం శివారులోని బిడ్జి దగ్గర కృష్ణానదిలో కొందరు వ్యక్తులు జేసీబీతో టిప్పర్‌లో ఇసుక నింపుతుండగా పెట్రోలింగ్ పోలీసులు పట్టుకున్నారు. అనుమతి పత్రాలు లేకపోవడంతో జేసీబీ, టిప్పర్‌ను పెబ్బేరు పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఎర్రవల్లి మండలం, కొండపేటకు చెందిన జేసీబీ యజమాని నరసింహ, ఆపరేటర్ సింగోటం, తిమ్మాపురం గ్రామానికి చెందిన టిప్పర్ యజమాని వడ్ల శంకర్‌నాయుడు, గద్వాల్ మండలం, గోనుపాడుకు చెందిన టిప్పర్ డ్రైవర్ బీచుపల్లిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. టిప్పర్, జేసీబీలను సీజ్ చేసినట్లు తెలిపారు. ఇసుకను అక్రమంగా తరలిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

చెత్త కాల్చడంతో పంక్చర్ డబ్బాకు మంటలు

అమరచింత: మున్సిపల్ కార్మికులు రోడ్డుపై ఉన్న చెత్తను తగుల బెట్టడంతో పక్కనే ఉన్న సైకిల్ పంక్చర్ డబ్బా కాలిపోయిన సంఘటన సోమవారం పట్టణంలో చోటుచేసుకుంది. పట్టణానికి చెందిన దివ్యాంగుడు ఖమ్రుద్దీన్ కొన్ని సంవత్సరాలుగా రాజీవ్ గాంధీ చౌరస్తాలోని నాగల్ కడ్మూర్ రహదారి పక్కన సైకిల్ పంక్చర్ షాపును కొనసాగిస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు. కాలనీలోని చెత్తతో పాటు రహదారిపై ఉన్న చెత్తను డబ్బా సమీపంలో పారవేయ్యడంతో పారిశుద్ధ్య కార్మికులు సోమవారం తెల్లవారు జామున వాటిని తగుల పెట్టి వెళ్లిపోయారు. దీంతో మంటలు సమీపంలోని డబ్బాకు అంటుకున్నాయి. ఈ విషయం గమనించిన పాదచారులు డబ్బా యజమానికి సమాచారం అందించారు. కుటుంబ సభ్యులతో ఖమ్రుద్దీన్ చేరుకుని మంటలను ఆర్పినా ఫలితం లేక పోయింది. డబ్బాలో ఉన్న ఐదు సైకిళ్లు, సామగ్రి కాలిపోయాయి. సుమారు రూ.60 వేల నష్టం వాటిల్లింది. పారిశుద్ధ్య కార్మికుల అజాగ్రత్త వల్లనే నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు.

అపరిచితులతో అప్రమత్తంగా ఉండాలి

కేటీదొడ్డి: అపరిచితులపై అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ శ్రీనివాస్‌రావు అన్నారు. మండలంలోని కొండాపురంలో సోమవారం రాత్రి రోడ్డు భద్రతా, ట్రాఫిక్, సైబర్ నేరాలపై ప్రజలకు కళాజాత బృందం ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. కొత్త వ్యక్తులు ఎవరైనా అనుమానస్పదంగా కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. బాల్య వివాహాలు చేసినా, ప్రోత్సహించిన వారిపై కేసులు నమో దు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ కేశవరావు, కానిస్టేబుల్ రాధమ్మ, కళా బృందం స భ్యులు కృష్ణ, రామాంజనేయులు పాల్గొన్నారు.



కొత్తపల్లిలో..



మోజర్ల గ్రామంలో ..



వనపర్తిలో అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు



పాన్‌గల్‌లో అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న నాయకులు

బడుగుజాతి భాస్కరుడు అంబేడ్కర్

- ఘనంగా అంబేడ్కర్‌కు నివాళులు
- వాడవాడలా విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు
- జై భీం నినాదాలతో మార్మోగిన వీధులు
- పట్టణాలు, మండల కేంద్రాల్లో ర్యాలీలు



కొత్తకోట చౌరస్తాలో అంబేడ్కర్ జయంతి వేడుకల్లో పలు పార్టీల నాయకులు



దుప్పల్లిలో..



శ్రీరంగాపురం మండల కేంద్రంలో..

సాక్షి, నెట్‌వర్క్: రాజ్యాంగ నిర్మాత, బడుగు జాతి భాస్కరుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 134వ జయంతి ఘనంగా నిర్వహించారు. ఆయన ఆశయ సాధన కోసం కృషి చేస్తామని నేతలు, నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ప్రధాన కూడళ్లలో విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేశారు. పట్టణాలు, మండల కేంద్రాల్లో ర్యాలీలు నిర్వహిస్తూ జై భీం నినాదాలు చేశారు.

■ వనపర్తి, శ్రీరంగాపురం, వెంకటాపురం, కంబాళాపురం గ్రామాల్లో అంబేడ్కర్ విగ్రహాలకు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

■ వనపర్తి పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో సీపీఎం నాయకులు ఎండీ జబ్బార్, పుట్ట ఆంజనేయులు, పరమేశ్వరాచారి, కురుమయ్య, సీపీఐ నాయకులు కళావతమ్మ, రమేష్, గోపాలకృష్ణ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చందాపురం, పెద్దగూడెం, కడుకుంట్ల, అచ్యుతాపురం, చిట్యాల, చిమనగుంటపల్లి గ్రామాలలో అంబేడ్కర్‌కు నివాళులర్పించారు.

■ కొత్తకోట చౌరస్తాలో పలు పార్టీల నాయకులు ఉమ్మడిగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ జెడ్పీటీసీ విశ్వేశ్వర్ అంబేడ్కర్ చేసిన కృషిని ఆయన కొనియాడారు. వనపర్తి జిల్లా మెడికల్ కళాశాల, అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. తహసీల్దార్ వెంకటేశ్వర్లు నివాళులర్పించారు.

■ అమరచింతలో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్, సీపీఎం, సీపీఐ, మాస్‌లైన్ పార్టీల నాయకులు, దళిత సంఘాల నాయకులు బస్టాండ్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అంబేడ్కర్ జాతర కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదానంలో సీఐ శివకుమార్, ఎస్‌ఐ సురేష్ పాల్గొన్నారు.

■ పాన్‌గల్ మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి ఆయా సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

■ కొత్తకోట మండలం, అమడబాకులలో జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ వామన్‌గౌడ్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

■ ఉమ్మడి గోపాల్‌పేట మండలంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలువ వేసి నివాళులర్పించారు.

■ పెద్దమందడి మండలం మోజెర్ల ఉద్యాన కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్, కె.భాస్కర్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు.

■ మదనాపురం మండల కేంద్రంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దుప్పల్లి, కొత్తపల్లి, దంతనూరు, రామన్‌పాడు, అజ్జకొల్లు, గోపన్‌పేట, కొన్నూరు, నర్సింగాపురం, నెలివిడి గ్రామాల్లో అంబేడ్కర్‌కు నివాళులర్పించారు.

■ ఆత్మకూర్‌లో, మండలం, గ్రామాల్లో ఘనంగా అంబేడ్కర్ జయంతి ఉత్సవాలు నిర్వహించారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు. తూంపల్లిలో ఏర్పాటు చేయనున్న అంబేడ్కర్ విగ్రహానికి బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కంభళాపురం రాము నగదు అందజేశారు.

■ ఖిల్లాఘనపురం, అప్పారెడ్డిపల్లి, షాపురం, ఉప్పరిపల్లి తదితర గ్రామాల్లో అంబేడ్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామాల్లో యువకులు పండ్లు పంచారు, అన్నదానం ఏర్పాటు చేశారు.

■ జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్, పట్టణ అధ్యక్షుడు పలుస రమేష్‌గౌడ్, జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్‌లు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. న్యాయసేవాధికార సంస్థ, ప్రజా సంఘాలు, కుల సంఘాలు, ఉపాధ్యాయ సంఘాలు, బీజేపీ, సీపీఎం, సీపీఐ, ఆర్టీసీ యూనియన్, తెలంగాణ జనసమితి, వనపర్తి న్యాయవాదుల సంఘం, పలువురు అధికారులు నివాళులర్పించారు. అంబేడ్కర్ విజయ యాత్రను యువకులు డీజే సౌండ్‌తో నృత్యాలు, కేరింతలు దళితవాడ నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చీర్ల విజయ చందర్ జెండా ఊపి ప్రారంభించారు. అంబేడ్కర్ జయంతి ఉత్సవాల్లో ఎమ్మెల్యే మేఘారెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డిలు పాల్గొన్నారు. అంబేడ్కర్ చౌక్‌లో ప్రజావాగ్గేయకారుడు రాజారామ్ ప్రకాశ్ తన ఆట పాటలతో అలరించారు. పలు దళితవాడ కాలనీల్లో అన్నదానం ఏర్పాటు చేయగా, కొన్ని చోట్ల రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేశారు.

ఖిల్లాఘనపురం: మండలంలో వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలను ఆవిష్కరించారు. మండలంలోని మల్కాపురం, పర్వతాపురం, సల్కెలాపురం గ్రామాల్లో అంబేడ్కర్ విగ్రహాలను, సల్కెలాపురంలో మహాత్మాగాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రతి ఒక్కరికి ఆదర్శప్రాయుడన్నారు. కార్యక్రమంలో మండల సింగల్ విండో చైర్మన్ మురళీధర్‌రెడ్డి, వైస్ చైర్మన్ శ్యామ రాజు, మాజీ ఎంపీపీ వెంకటయ్య, నాయకులు పాల్గొన్నారు.



పాన్‌గల్‌లో ...



వనపర్తి పట్టణంలో సీపీఐ నేతల నివాళి..



ఆత్మకూర్‌లో..



మూలమల్లలో ..



పెన్నంచర్లలో..



కొత్తకోట తహసీల్దార్ కార్యాలయంలో ..



నందిమల్ల క్యాంపు కాలనీలో ..



వనపర్తి న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో..

కొనుగోలు కేంద్రాలు సద్వినియోగం చేసుకోవాలి

ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి



శ్రీనివాసపురంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

వనపర్తి: ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. సోమవారం ఉదయం శ్రీనివాసపురంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనా రెడ్డి, డీసీసీబీ చైర్మన్ విష్ణు వర్ధన్ రెడ్డి తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు పండించిన వరి ధాన్యం పంటను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే అమ్ముకొని ప్రభుత్వం ఇస్తున్న క్వింటాలుకు రూ.500 బోనస్ లబ్ధి పొందాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ సుబ్రమణ్యం, స్థానిక తహసీల్దార్ రమేష్ రెడ్డి, మాజీ ఎంపీపీలు కిచ్చారెడ్డి, శంకర్ నాయక్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఉమ్మల్ల రాములు, రైతులు ఉన్నారు.

రజతోత్సవాలు జయప్రదం చేద్దాం

అమరచింత: ఈనెల 27న వరంగల్ నిర్వహించే బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవాలను విజయవంతం చేయాలని మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ మంగమ్మ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎస్‌ఏ రాజు కోరారు. మండల కేంద్రంలో సోమవారం రజతోత్సవాల వాల్‌పోస్టర్ ఆపార్టీ మండల, పట్టణ అధ్యక్షుడు రమేష్ ముదిరాజ్, అక్కల నరసింహులు గౌడ్‌ల ఆధ్వర్యంలో విడుదల చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ రాజేందర్ సింగ్, నరేష్ రెడ్డి, షానవాజ్, నాగభూషణంగౌడ్ పాల్గొన్నారు.



బీఆర్ఎస్ రజతోత్సవ వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న ఆపార్టీ నాయకులు

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి



సీసీ కెమెరాలపై అవగాహన కల్పిస్తున్న సీఐ శివకుమార్

అమరచింత: పందుల పెంపకందారులు తమ పందుల నివాస ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సీఐ శివకుమార్ అన్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లో పందుల పెంపకందారులకు సీసీ కెమెరాల ఆవశ్యకతతో పాటు పందులు అపహరించే వ్యక్తులు పెరిగినట్లు తెలిపారు. ఎవరైనా అనుమానాస్పదంగా సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

చోరీకి పాల్పడిన వ్యక్తి అరెస్టు..

ఈనెల 12న పట్టణానికి చెందిన బుడు బుడుకల రవి, ముష్టి రాజశేఖర్‌లకు చెందిన ఆటోలలో ఉన్న బ్యాటరీలు, టేప్ రికార్డర్లు ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని పట్టుకున్నట్లు సీఐ శివకుమార్ తెలిపారు. చోరీకి సంబందించి సంఘటనపై భగత్‌సింగ్ విగ్రహం వద్ద వాహనాల తనిఖీ నిర్వహించారు. ఇదే గ్రామానికి చెందిన జహంగీర్‌ను విచారిస్తుండగా సమాధానం చెప్పడంలో తడబడ్డాడు. పోలీస్ స్టేషన్ కు తీసుకెళ్లి విచారించగా చోరీకి పాల్పడినట్లు ఒప్పుకున్నాడు. చోరీ చేసిన వస్తువుల విలువ సుమారు రూ.24,500 ఉంటుందని సీఐ తెలిపారు. జహంగీర్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తామన్నారు. ఆయనతో పాటు ఎస్‌ఐ సురేష్ ఉన్నారు.

రక్షణ గోడలు లేని వంతెన



తిరుమలయ్య గుట్ట సమీపంలో రక్షణ గోడలు లేని వంతెన

వనపర్తి రూరల్: వనపర్తి నుంచి పెబ్బేరు వెళ్లే ప్రధాన రహదారిలో మండలంలోని తిరుమలయ్యగుట్ట సమీపంలోని వంతెనకు ఇరువైపుల రక్షణ గోడలు లేవు. ఫలితంగా గతంలో పలు ప్రమాదాలు జరిగాయని స్థానికులు చెబుతున్నారు. దీనికి తోడు వంతెనకు సమీపంలో ప్రమాదకర మలుపు ఉంది. ఈ మలుపు దగ్గర వేగ నియంత్రికలు, సూచిక బోర్డులు లేకపోవడం ప్రమాదాలకు ప్రధాన కారణమని వాహనదారులు అంటు న్నారు. వంతెనకు ఇరువైపుల రక్షణ గోడలు నిర్మించి, ప్రమాదకరపు మలుపు దగ్గర సూచిక బోర్డు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

కాళికాంబ కమలేశ్వర ఆలయ పునఃప్రతిష్ఠ



కమలేశ్వర పునఃప్రతిష్ఠ పూజలు

వనపర్తిటౌన్: జిల్లా కేంద్రంలోని పాత బజారులో శ్రీ కాళికాంబ సమేత కమలేశ్వర ఆలయం పునఃప్రతిష్ఠ వేడుకలు సోమవారం ప్రారంభమయ్యాయి. తెల్లవారు జామున సుప్రభాత సేవ నుంచి రాత్రి 10గంటల వరకు పూజా క్రతువులు నిర్వహించారు. రోడ్ల విస్తరణలో భాగంగా కాళీమాత ఆలయాన్ని తొలగించడంతో ప్రస్తుతం పునఃప్రతిష్ఠ మహోత్సవం చేపడుతున్న సంగతి తెలిసిందే. పాత బజార్ ప్రాంతంలోని సమీప కాలనీవాసులు కాళికాంబ సహిత కమిటీ ఆలయ పునః ప్రతిష్ఠ మహోత్సవ వేడుకలకు పెద్ద ఎత్తున తరలి వచ్చారు.

జార్జిరెడ్డి స్ఫూర్తితో సాగుదాం

అమరచింత: అట్టడుగు వర్గాలకు, మహిళలకు విద్య కావాలని ఆధిపత్య వర్గాలను ఎదిరించి విద్యార్థుల, మహిళలు సమస్యల పరిష్కారం కోసం పోరాడిన జార్జిరెడ్డి స్ఫూర్తితో నేటి తరం యువకులు ముందుకు వెళ్లాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ అన్నారు. జార్జిరెడ్డి 53వ వర్ధంతిని పురస్కరించుకుని మండలంలోని నందిమళ్ల గ్రామంలో జార్జిరెడ్డి చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విద్య ప్రతి ఒక్కరికీ అందాలని, చదువుతోనే సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. విద్యకోసం ప్రభుత్వాలు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని పోరాటాలు చేసిన గొప్ప నాయకుడన్నారు. కార్యక్రమంలో ఉదయ్, అఖిల్, చరణ్, శివ, శంకర్, జగన్ పాల్గొన్నారు.



జార్జిరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

భూ భారతి పోర్టల్ ఆవిష్కరణ తిలకించిన రైతులు



పాన్‌గల్ రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్ తిలకిస్తున్న అధికారులు, రైతులు

పాన్‌గల్: మండల కేంద్రంలోని రైతు వేదికలో సోమవారం రాత్రి భూభారతి పోర్టల్ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వ్యవసాయ అధికారులు, స్థానిక నాయకులు తిలకించారు. అంతకుముందు వీడియో కాన్ఫరెన్స్‌లో చిరుధాన్యాల సాగు, వాటి ద్వారా విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ, వేసవిలో కూరగాయాల సాగు, ప్రతి గ్రామంలో నాణ్యమైన విత్తనాల ఉత్పత్తి, పంట వ్యర్థాలను కాల్చడం ద్వారా జరిగే నష్టాల గురించి వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కల్పించినట్లు ఏడీఏ చంద్రశేఖర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోవర్దన్‌సాగర్, ఏఓ రాజవర్దన్‌రెడ్డి, మండల కాంగ్రెస్ నాయకులు వెంకటేష్‌నాయుడు, రవికుమార్, రాముయాదవ్, బ్రహ్మయ్య, ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

ఆత్మకూర్‌లో అగ్నిమాపక వారోత్సవాలు



ఆత్మకూర్‌లో అగ్నిమాపక వారోత్సవాల్లో సిబ్బంది

ఆత్మకూర్: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ఆత్మకూర్ పట్టణంలోని ఫైర్‌స్టేషన్ వద్ద సోమవారం సిబ్బంది విన్యాసాలు ప్రదర్శించారు. ప్రమాదం సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విన్యాసాలతో క్లుప్తంగా చూయించారు. ఈ సందర్భంగా స్టేషన్ ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ప్రజలు ప్రమాదాల బారిన పడ్డప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈనెల 20వ తేదీ వరకు ప్రధాన కూడళ్లు, గ్రామాల్లో ఇలాంటి ప్రదర్శనలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. అనంతరం వారోత్సవాల కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది సంజీవరెడ్డి, కృష్ణ, రాముడు, నర్సింహారెడ్డి, భీమేశ్వర్‌రెడ్డి, మోహన్, తదితరులు పాల్గొన్నారు.